సాక్షి
విశాఖపట్నం
సోమవారం । 22 । జూలై । 2024



నేవీ సైకిల్ యాత్ర

ఐఎన్ఎస్ శాతవాహన గోల్డెన్ జూబ్లీ వేడుకల సందర్భంగా రుషికొండ వరకు నేవీ ఉద్యోగులు సైకిల్ యాత్ర నిర్వహించారు.



నగరంలో వర్షం

నగరంలో ఆదివారం ఓ మోస్తరు వర్షం కురిసింది. సముద్రంలో అలలు ఎగసిపడ్డాయి. ఈదురుగాలులు వీచాయి.



తీరంలో సలోని

కొమ్మాది: మంగమారిపేటలో ఆదివారం నటి సలోని సందడి చేశారు.మట్కా చిత్రానికి సంబంధించి పలు సన్నివేశాలను మంగమారిపేట, భీమిలిలో చిత్రీకరించారు.

న్యూస్‌రీల్

దుర్గమ్మకు కనకమహాలక్ష్మి దేవస్థానం సారె



పట్టువస్త్రాలు, సారె అందజేస్తున్న ఏఈవో రాంబాబు తదితరులు

దాబాగార్డెన్స్: ఆషాఢ మాసోత్సవాలను పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు విశాఖలోని శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం నుంచి ఆదివారం సారె సమర్పించారు. దేవస్థానం ఏఈవో రాంబాబు, ఆలయ అర్చకులు, అధికారులను దుర్గగుడి ఈవో కె.ఎస్.రామరావు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని సారె సమర్పించి పూజలు జరిపించుకున్నారు. అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందచేయగా, ఈఓ రామరావు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు. కార్యక్రమంలో కనకమహాలక్ష్మి అమ్మవారి అర్చకుడు కె శ్రీనివాసశర్మ, వేద పండితులు సీహెచ్ఎల్ఎన్ అవధానులు, హనుమాన్ శర్మ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రేపు బాధ్యతలు స్వీకరిస్తా

జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్



సాక్షి, విశాఖపట్నం: మహా విశాఖ నగర పాలక సంస్థ(జీవీఎంసీ) కమిషనర్‌గా మంగళవారం బాధ్యతలు స్వీకరిస్తానని ఐఏఎస్ అధికారి పి.సంపత్‌కుమార్ 'సాక్షి'కి తెలిపారు. జీవీఎంసీ కమిషనర్‌గా సంపత్‌కుమార్‌ని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఆయనతో ఫోన్‌లో సంప్రదించగా.. మంగళవారం బాధ్యతలు స్వీకరించిన తర్వాత.. జీవీఎంసీలో ప్రస్తుత పరిస్థితులపై అధికారులతో సమీక్ష నిర్వహిస్తానన్నారు. విశాఖ అద్భుతమైన నగరమని, జీ20 సదస్సు జరిగిన సమయంలో ఏర్పాట్లు పర్యవేక్షించేందుకు నగరంలో కొద్ది రోజులు ఉన్నానని వెల్లడించారు. నగర అభివృద్ధికి కృషి చేయడంతో పాటు.. ప్రజలకు అవసరమైన సమగ్ర సౌకర్యాలు కల్పించేందుకు అవసరమైన ప్రణాళికలు అమలు చేస్తానని సంపత్‌కుమార్ తెలిపారు.

నేడు జీవీఎంసీలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక



దాబాగార్డెన్స్: జీవీఎంసీలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక సోమవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించనున్నట్లు నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జీవీఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్ వై శ్రీనివాసరావు ప్రకటనలో పేర్కొన్నారు. పారిశుద్ధ్యం, పట్టణ ప్రణాళికా విభాగం, రెవెన్యూ, యూసీడీ, ఇంజనీరింగ్ తదితర విభాగాలకు సంబంధించిన సమస్యలు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేసుకోవచ్చని తెలిపారు. నగర ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

సెంట్రల్ జైల్‌లో నేటి నుంచి జాతీయ స్థాయి సమావేశాలు

ఆరిలోవ: విశాఖ కేంద్ర కారాగారంలో మూడు రోజులు పాటు జాతీయ స్థాయి సమావేశాలు జరగనున్నట్లు కారాగారం సూపరింటెండెంట్ ఎస్.కిశోర్‌కుమార్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. కొత్తగా రూపొందించిన చట్టాల గురించి సోమవారం నుంచి 24 వరకు సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. బ్యూరో ఆఫ్ పోలీస్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో జరగనున్న ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ జైళ్ల శాఖ ఐజీ ఇండ్ల శ్రీనివాసరావు పాల్గొని కార్యక్రమం ప్రారంభిస్తారన్నారు.

ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణంతో తీవ్ర నష్టం

అల్లిపురం: మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం వల్ల ఆటో కార్మికులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని జిల్లా ఆటో రిక్షా కార్మిక సంఘం ప్రతినిధులు సీహెచ్ కాసుబాబు, డి.రమణ, షేక్ రెహమాన్ అన్నారు. ఆటో డ్రైవర్ల జీవన భృతికి గండి కొడుతున్న ఓలా, ఉబర్, ర్యాపిడో వంటి యాప్‌లను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆటో మోటార్ రంగ కార్మికులకు ఆదాయం పెరిగేలా చర్యలు చేపట్టాలని, జీవో 21ను రద్దు చేయాలని, సంక్షేమ బోర్డులు ఏర్పాటు చేయాలని తదితర డిమాండ్లతో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌ను ఆదివారం కలిసి వినతిపత్రం అందించారు.

నమో నారసింహా...

- ముగిసిన గిరి ప్రదక్షిణ
- జనసంద్రంగా మారిన సింహగిరి
- వర్షంలోనూ నడలని సంకల్పం
- భక్తులతో కిటకిటలాడిన పాతగోశాల
- విశేషంగా ఆలయ ప్రదక్షిణలు
- 9 లక్షల మంది గిరి ప్రదక్షిణ చేశారని అంచనా
- 60 వేల మందికి దర్శనం



వర్షంలో తడుస్తూ గిరి ప్రదక్షిణకు..



గిరి ప్రదక్షిణ చేసి తొలిపావంచా వద్దకు వెళ్తున్న భక్తులతో కిక్కిరిసిన అడవివరం ప్రధాన రహదారి

సింహాచలం: శ్రీవరాహలక్ష్మీనృసింహస్వామిని స్మరిస్తూ శనివారం లక్షలాదిమంది భక్తులు చేపట్టిన సింహగిరి ప్రదక్షిణ ఆదివారంతో ముగిసింది. సింహాచలంలోని తొలిపావంచా వద్ద ప్రదక్షిణ ప్రారంభించిన భక్తులు సింహగిరి చుట్టూ ఉన్న 32 కిలోమీటర్ల ప్రదక్షిణ చేసి తిరిగి తొలిపావంచా వద్దకు చేరుకున్నారు. స్వామి సన్నిధిలో మళ్లీ కొబ్బరికాయ కొట్టి గిరి ప్రదక్షిణ ముగించారు. పలువురు భక్తులు స్వామి దర్శనానికి మెట్లమార్గంలో సింహగిరికి తరలివెళ్లారు. ఆదివారం తెల్లవారు జాము నుంచి భారీ వర్షం కురుస్తున్నా భక్తులు స్వామి దర్శనానికి బారులుదీరారు.

తెల్లవారుజామున 3.30గంటల నుంచే దర్శనాలు

గిరి ప్రదక్షిణ చేసి వచ్చిన భక్తులకు ఆదివారం తెల్లవారుజామున 3.30గంటల నుంచే స్వామివారి దర్శనాలు కల్పించారు. ముందుగా ఉదయం 5.30 గంటల నుంచి దర్శనాలు కల్పిస్తామని దేవస్థానం అధికారులు ప్రకటించారు. కానీ భక్తుల సౌకర్యార్థం తెల్లవారుజామున 3.30 గంటల నుంచే దర్శనాలు అందజేయడం విశేషం. సాయంత్రం 4 గంటల వరకు నిర్విరామంగా దర్శనాలు అందజేశారు. భక్తులకు త్వరితగతిన దర్శనాలు అందించేందుకు ఉచిత దర్శనం క్యూతో పాటు రూ100,రూ.300 దర్శన టికెట్ల క్యూల్లో కూడా భక్తులను ఉచితంగా పంపించారు. ఆలయ నీలాద్రి గుమ్మం దగ్గర నుంచే లఘు దర్శనం కల్పించారు. అంతరాలయ దర్శనం బంద్ చేశారు. మధ్యాహ్నం ఒంటి గంటలోపే దాదాపు భక్తుల దర్శనాలు పూర్తయ్యాయి.

విశేషంగా ఆలయ ప్రదక్షిణలు

ఆషాఢ పౌర్ణమిని పురస్కరించుకుని సింహగిరిపై ఆలయ ప్రదక్షిణలు ఘనంగా జరిగాయు. తెల్లవారుజామున 3గంటల నుంచి భక్తులను ఆలయ ప్రదక్షిణలకు అనుమతించారు. అప్పటికే సింహగిరికి చేరుకున్న భక్తులు ఆలయ బాహ్య ప్రాకారం చుట్టూ ప్రదక్షిణలు చేశారు.

సింహగిరిపై జన జాతర

శనివారం 32 కిలోమీటర్లు గిరి ప్రదక్షిణ చేసి స్వామివారి దర్శనానికి వచ్చిన భక్తులతోను, మరో పక్క ఆలయ ప్రదక్షిణలకు వచ్చిన భక్తులతోను ఆదివారం సింహగిరి జనజాతరగా మారింది. భక్తులతో కిటకిటలాడింది.

9 లక్షలు మంది గిరి ప్రదక్షిణ

శనివారం 32 కిలోమీటర్ల మేర 9 లక్షల మంది భక్తులు గిరి ప్రదక్షిణ చేసినట్టు దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి తెలిపారు. అలాగే ఆదివారం 60 వేల మంది స్వామివారి దర్శనానికి వచ్చినట్టు, సుమారు 5వేల మంది ఆలయ ప్రదక్షిణల్లో పాల్గొన్నట్టు అంచనా వేశారు.

- కొండదిగువ పాత గోశాల జంక్షన్ నుంచి పాత అడవివరం వరకు ఉన్న మార్గం భక్తులతో కిక్కిరిసింది. ఒక పక్క గిరి ప్రదక్షిణ పూర్తిచేసి తొలి పావంచాకు చేరుకునే భక్తులతోను, మరోపక్క గిరి ప్రదక్షిణ పూర్తిచేసుకుని ఇళ్లకు చేరుకునే భక్తులతోను రద్దీ నెలకుంది.
- గిరి ప్రదక్షి ముగించుకుని తిరిగి కొబ్బరి కాయలు కొట్టే భక్తులతో తొలిపాంచా కిటకిటలాడింది.
- మెట్లమార్గంలో కేవలం సింహగిరికి వెళ్లే భక్తులనే అనుమతించారు. కొండదిగువకి మెట్లమార్గంలో అనుమతించలేదు.
- కొండదిగువకి భక్తులను చేరవేసేందుకు దేవస్థానం 45 ఉచిత బస్సులను ఏర్పాటు చేసింది.
- 32 కిలోమీటర్లు చేసి గిరి ప్రదక్షిణ చేసి స్వామివారి దర్శనానికి సింహగిరికి వచ్చిన భక్తులను ఆలయ ఉత్తరరాజగోపురం వద్ద ఏర్పాటు చేసిన వంతెన దిగువ నుంచి ఆలయంలోకి, దర్శనం చేసుకుని బయటకు వచ్చే భక్తులను దక్షిణ రాజగోపురం వద్ద ఏర్పాటు చేసిన వంతెన దిగువ నుంచి పంపించారు.
- ఆలయ నీలాద్రి గుమ్మం వద్ద నాలుగు లైన్లు ఏర్పాటు చేసి భక్తులకు దర్శనాలు కల్పించారు.



క్యూ లైన్‌లో భక్తులు

- సింహగిరిపై పీఆర్‌వో కార్యాలయం వద్ద, సింహగిరి బస్టాండ్‌లోను అడవివరం ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేశారు. వైద్య సేవలు అందించారు. మందులు పంపిణీ చేశారు.
- సింహగిరిపైన, కొండదిగువ పెద్ద ఎత్తున పోలీసులు బందోబస్తు నిర్వహించారు.
- ఆలయ నీలాద్రిగుమ్మం వద్ద నాలుగు లైన్లలో భక్తులు వెళ్లి దర్శనం చేసుకునేలా ర్యాంపులు ఏర్పాటు చేశారు.
- భక్తులు కొట్టిన కొబ్బరికాయలతో తొలిపావంచా వద్ద పెద్ద ఎత్తున కుప్ప ఏర్పడింది. ఎప్పటికప్పుడు కాంట్రాక్టర్ తరలించేలా చర్యలు చేపట్టారు.
- సింహగిరిపై అన్నప్రసాద భవనంలో నిర్విరామంగా దద్దోజనం, పొంగళి ప్రసాదాన్ని భక్తులకు అందజేశారు.
- కొండదిగువ పాతగోశాల జంక్షన్ వద్ద తీవ్ర రద్దీ నెలకుంది. ప్రదక్షిణ ముగించుకున్న భక్తులంతా పాతగోశాల దంక్షన్‌లో ఆర్టీసి బస్సులు ఎక్కారు. ఆర్టీసీ బస్సులన్నీ భక్తులతో రద్దీగా మారాయి.
- తొలిపావంచా వద్ద భక్తులకోసం ఏర్పాటు చేసిన స్టాల్,క్యూలపై వేసిన షామియానాలు వర్షానికి కూలిపోయాయి.



ఈదురుగాలులకు కూలిపోయిన టెంట్లు



ఆలయ ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు



ప్రదక్షిణ పూర్తి చేసి తర్వాత తొలిపావంచా వద్ద మొక్కుకుంటున్న భక్తులు

మా పరిస్థితి ఏంటీ?

- ఎంపీ భరత్‌ను నిలదీసిన పలు వార్డుల టీడీపీ అధ్యక్షులు
- వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు చేరితే మేం ఒప్పుకోమని తెగేసి చెప్పిన గాజువాక నేతలు



ఎంపీ భరత్‌ను నిలదీస్తున్న టీడీపీ నాయకులు, మాజీ కార్పొరేటర్ పోలిపల్లి జ్యోతి, మహిళా నేతలు

మహారాణిపేట: ''ఎంపీ సార్.. మీరు కండువా కప్పేశారు. అధికారంలో ఉన్నా.. లేకపోయినా.. పార్టీని వార్డుల్లో నిలబెట్టేందుకు ఎన్నో అష్టకష్టాలు పడ్డాం. ఇప్పుడు మళ్లీ ఆ కార్పొరేటర్లే వార్డులో పెత్తనం చెలాయిస్తారు. అధికారంలో ఉన్నా.. మా పరిస్థితి అగమ్య గోచరమేనా. మా భవిష్యత్తు ఆలోచించరా.?'' అంటూ టీడీపీ కార్యాలయంలో ఎంపీ భరత్‌ను వివిధ వార్డులకు చెందిన టీడీపీ కార్పొరేటర్లు నిలదీశారు. మహా విశాఖ నగర పాలక సంస్థ (జీవీఎంసీ) పరిధిలో వైఎస్సార్‌సీపీకి చెందిన కార్పొరేటర్లు టీడీపీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశం ఉత్కంఠగా సాగింది. పార్టీ నాయకులు, ఎమ్మెల్యేలు,ఎంపీ సమక్షంలో పలువురు వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు తెలుగుదేశం పార్టీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయం ఆవరణలో కొంత మంది తెలుగుదేశం పార్టీ మహిళా నాయకులు నిరసన గళం విప్పారు. తమ అభిప్రాయాలు కనీసం తెలుసుకోకుండా.. కార్పొరేటర్లకు కండువా కప్పడంపై ఆయా వార్డులకు చెందిన అధ్యక్షులు, సీనియర్ లీడర్లు అసహనం వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్న సమయంలో ఆ పార్టీకి చెందిన కార్పొరేటర్లే తమ వార్డుల్లో పెత్తనం సాగించారని, ఇప్పుడు టీడీపీ అధికారంలో ఉన్నా.. వాళ్లే ముందు వరసలో ఉండేందుకే పార్టీలో చేరారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం తమ వ్యవహారాలు చక్కబెట్టుకోడానికే తప్ప.. పార్టీ మీద గౌరవంతో రాలేదని వ్యాఖ్యానించారు. ఎప్పటినుంచో పార్టీని నమ్ముకొని ఉన్నాం. ఇప్పుడు ఆ పార్టీ నుంచి వచ్చిన వారిని చేర్చుకుంటే వాళ్లు ఇప్పుడు కూడా మాపై పెత్తనం చేస్తారని.. ఇప్పుడు మేమేం చెయ్యాలంటూ 30వ వార్డుకు చెందిన టీడీపీ నాయకురాలు, మాజీ కార్పొరేటర్ పోలిపల్లి జ్యోతి ఎంపీ భరత్‌ను నిలదీశారు. వాళ్లంతా శత్రువులు వారిని ఎలా చేర్చుకుంటారని వివిధ వార్డులకు చెందిన మహిళా కార్యకర్తలు భరత్‌ను చుట్టుముట్టి తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. అక్కడ ఉన్న ఎమ్మెల్యేలు, ఎంపీ భరత్ వారిని వారించి శాంతింపజేసేందుకు ప్రయత్నించారు. ఎవ్వరికీ అన్యాయం చెయ్యమని వెళ్లిపోడానికి ప్రయత్నించిన ఎంపీ భరత్‌కు కార్యాలయం ఆవరణలోనూ అడ్డుకునేందుకు టీడీపీ నేతలు యత్నించారు.

టీడీపీలో చేరిన వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు

డాబాగార్డెన్స్: గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్లో పలువురు వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు ఆదివారం టీడీపీ పంచన చేరారు. జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కంపా హనోక్‌తో పాటు కార్పొరేటర్లు కోడూరు అప్పలరత్నం, సారిపల్లి గోవింద్, బొడ్డు నరసింహప్రసాద్, ఇల్లపు వరలక్ష్మి, లొడగల అప్పారావు, రాజాన రామారావు చేరారు. వీరంతా టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, ఎంపీ భరత్, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణ బాబు, వంశీకృష్ణ శ్రీనివాస్ సమక్షంలో టీడీపీలో చేరారు.

వ్యక్తిగత కారణాలతోనే..

సీతమ్మధార: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు కార్పొరేటర్లు తెలుగుదేశంలో చేరడంపై ఉత్తర నియోజకవర్గం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త కేకేరాజు స్పందించారు. వైఎస్సార్‌సీపీ టికెట్లు ఇచ్చి గెలిపించిందని, గెలిచిన కొందరు వ్యక్తిగత కారణాలతో పార్టీ వీడారన్నారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజమన్నారు.

గాజువాకలోనూ లుకలుకలు..!

మరోవైపు గాజువాక నియోజకవర్గానికి చెందిన పలువురు టీడీపీ నేతలు సైతం జిల్లా పార్టీ పెద్దల వ్యవహారంపై గుర్రుగా ఉన్నారు. వైఎస్సార్‌సీపీకి చెందిన కార్పొరేటర్లు బొడ్డు నర్సింహపాత్రుడు, ఇల్లపు లక్ష్మి, రాజన రామారావు టీడీపీలోకి చేరడంతో నియోజకవర్గంలో రచ్చ మొదలైంది. వారిని ఎలా చేర్చుకుంటారంటూ ఎమ్మెల్యేను ప్రశ్నిస్తున్నారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును నిలదీయ్యాలని నిర్ణయించుకున్నారు. ఆయన వస్తే గాజువాక పార్టీ కార్యాలయంలో పంచాయితీ పెడతామని నియోజకవర్గంలోని నేతలు తీర్మానించుకున్నట్లు తెలుస్తోంది. అదేవిధంగా వైఎస్సార్‌సీపీ నుంచి కార్పొరేటర్లు టీడీపీలో చేరుతున్నారన్న సమాచారం రావడంతో వారిని చేర్చుకోవద్దంటూ కొందరు టీడీపీ వార్డు అధ్యక్షులు, ముఖ్య నాయకులు పార్టీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీకి లేఖలు రాశారు. అయితే కార్పొరేటర్ల రాకతో అసంతృప్తితో ఉన్న టీడీపీ వార్డు స్థాయి నేతలను బుజ్జగించే పనిలో ఎమ్మెల్యేలున్నారు. ఇదిలా ఉండగా టీడీపీలో చేర్చుకోమని చెప్పిన వారంతా జనసేనలో చేరేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది.

వైఎస్సార్ సీపీని వీడేది లేదు

- తప్పుడు ప్రచారాలు నమ్మొద్దు
- అవకాశవాదులే పార్టీలు మారుతారు
- కార్పొరేటర్లు పద్మావతి, మేరీజోన్స్, జానకీరామ్

డాబాగార్డెన్స్: తల్లి వంటి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని వీడేది లేదు. రాజకీయ భిక్ష పెట్టిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని తల్లిలా చూసుకుంటామని ఆ పార్టీకి చెందిన 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి, 36వ వార్డు కార్పొరేటర్ మాసిపోగు మేరీజోన్స్, 37వ వార్డు కార్పొరేటర్ చెన్నా జానకీరామ్ 'సాక్షి'కి తెలిపారు. తాము కూడా తెలుగుదేశం, జనసేన పార్టీలో చేరుతున్నట్టు సోషల్ మీడియా జరిగిన ప్రచారాన్ని వీరంతా ఖండించారు. తామంతా వైఎస్సార్‌సీపీలోనే కొనసాగుతున్నామని, పార్టీని వీడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. రాజకీయ భిక్ష పెట్టిన జగన్‌మోహన్‌రెడ్డితోనే మా ప్రయాణమని, ఆయన నాయకత్వంలోనే తామంతా పనిచేస్తామని తేల్చి చెప్పారు. అవకాశవాదులే పార్టీ మారారని, తమకు ఆ అవసరం లేదన్నారు.

పార్టీ తల్లితో సమానం



పార్టీ తల్లితో సమానం. మా ప్రాణం ఉన్నంత వరకూ వైఎస్సార్ సీపీలోనే ఉంటాం. అవసరమైతే రాజకీయాలు వదులుకుంటాం. పార్టీ మారే ప్రసక్తే లేదు. మా ఊపిరి ఉన్నంత వరకు జగనన్నతోనే ఉంటాం ..ఆయనతోనే ప్రయాణిస్తాం.

–మాసిపోగు మేరీజోన్స్, 36వ వార్డు కార్పొరేటర్

జగన్ వెంటే..



తెలుగుదేశం పార్టీలో చేరినట్టు వస్తున్న వార్తల్లో వాస్తవం లేదు. వైఎస్సార్ సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో పనిచేయడానికి సిద్ధంగా ఉన్నాం. సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ ఓటమి చెందడం వల్ల చాలా బాధపడ్డాం..అయినా జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో పనిచేయడానికి ఎల్లవేళలా సిద్ధంగా ఉన్నాం. తాను ఏ పార్టీలో చేరేది లేదు. వైఎస్సార్ సీపీలోనే కొనసాగుతా. కొంతమంది తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు. అలాంటి ప్రకటనలు నమ్మవద్దు.

–తోట పద్మావతి, 34వ వార్డు కార్పొరేటర్

జగనే మా నాయకుడు



తాను పార్టీ మారుతున్నానని, తెలుగుదేశం పార్టీలో చేరుతున్నానని తప్పుడు ప్రచారాలు చేయడం సిగ్గుచేటు. తాను ఏ పార్టీలో చేరడం లేదు. జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోనే పని చేయడానికి సిద్ధంగా ఉన్నా. తప్పుడు ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నా.

–చెన్నా జానకీరామ్, 37వ వార్డు కార్పొరేటర్



• ఘనంగా గురుపౌర్ణమి

గురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం ఆలయాలు కిటకిటలాడాయి. ఉదయం నుంచి ఆలయాలు పండుగ శోభను సంతరించుకున్నాయి. వ్యాసభగవానుడి జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రతీ ఏడాది గురుపౌర్ణమిని జరుపుకుంటారు. గురుపౌర్ణమి సందర్భంగా చినవాల్తేరులోని ఈస్ట్ షిర్డీ ఆలయంలో ప్రత్యేక అలంకరణతో సాయిబాబాకు పూజలు నిర్వహించారు. వందలాది పండ్లు, ప్రసాదాలను నివేదన చేశారు.

వర్షాల కారణంగా 140 గ్రామాల్లో విద్యుత్ అంతరాయం

- త్వరితగతిన పునరుద్ధరించేందుకు ప్రయత్నాలు
- ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి



దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలను సరి చేస్తున్న ఈపీడీసీఎల్ సిబ్బంది

సాక్షి, విశాఖపట్నం: వర్షాలు, వరదల ప్రభావంతో దెబ్బతిన్న విద్యుత్తు సరఫరా వ్యవస్థను యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరిస్తున్నామని ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్షలు నిర్వహిస్తూ త్వరితగతిన పునరుద్ధరించేందుకు అవసరమైన చర్యలు తీసుకొంటున్నామన్నారు. ఈ చర్యల్లో భాగంగా అన్ని సెక్షన్ కార్యాలయాల్లో స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, అవసరమైన సామగ్రి, సిబ్బందిని అందుబాటులో ఉంచడం ద్వారా పునరుద్దరణ చర్యలను త్వరితగతిన చేపట్టగలిగామని వివరించారు. వర్షాల కారణంగా ఏపీఈపీడీసీఎల్ పరిధిలోని 5 సర్కిళ్లలోని 140 గ్రామాల్లో 47,999 సర్వీసు కనెక్షన్లకు విద్యుత్తు అంతరాయం ఏర్పడటంతో పాటు పలు చోట్ల విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయనీ, విద్యుత్ తీగలు తెగిపడటం, ట్రాన్స్‌ఫార్మర్లు పడిపోయాయని, వీటన్నింటినీ సరి చేస్తున్నట్లు వివరించారు. వర్షం తగ్గిన ప్రాంతాల్లో మిగిలిన వాటిని సోమవారం నాటికి ప్రత్యేక బృందాలతో పూర్తి స్థాయిలో పునరుద్ధరించేలా చర్యలు చేపట్టాలని ఎస్ఈలకు ఆదేశాలిచ్చామని సీఎండీ వివరించారు. ఏ సమస్య తలెత్తినా వినియోగదారులు కార్పొరేట్ ఆఫీసు 9440816373, విశాఖపట్నం 7382299975 సెల్ నంబర్‌కు తెలియజేయాలని వినియోగదారులకు సీఎండీ విజ్ఞప్తి చేశారు.

ఎక్కడి వారు అక్కడే..

- తహసీల్దార్లకు పాత స్థానాల్లోనే పోస్టింగులు!

మహారాణిపేట: సార్వత్రిక ఎన్నికల ముందు జిల్లాలో తహసీల్దార్లు ఎక్కడ పనిచేశారో.. తిరిగి అక్కడే వారికి పోస్టింగులు దక్కనున్నాయి. ఉద్యోగుల బదిలీలపై నిషేధం ఉన్న కారణంగా తహసీల్దార్లు యథావిధి స్థానాలకు రానున్నారు. ఈ ఏడాది జనవరి 31న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మొత్తం 19 మందిని శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాకు పంపారు. అక్కడ నుంచి 19 మంది తహసీల్దార్లు విశాఖలో విధుల్లో చేరారు. ఎన్నికల ప్రక్రియ పూర్తి కావడంతోపాటు నూతన ప్రభుత్వం కొలువు తీరింది. ఇప్పుడు తహసీల్దార్లను సొంత జిల్లాలకు బదిలీ చేయడానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. కానీ వర్షం వల్ల వారిని రిలీవ్ చేయలేదు. వర్షం తగ్గితే సోమవారం సాయంత్రం రిలీవ్ చేసే అవకాశం ఉందని రెవెన్యూ వర్గాలు చెబుతున్నాయి. అందువల్ల గతంలో ఏ తహసీల్దార్ ఎక్కడ పనిచేశారో తిరిగి అక్కడే వారిని నియమించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిసింది. విశాఖ రూరల్ తహసీల్దార్ సనపల రమణయ్య ఈ ఏడాది ఫిబ్రవరి 3న హత్యకు గురైన సంగతి తెలిసిందే. ఆ తర్వాత అక్కడ పని చేయడానికి ఎవరూ ముందుకు రాలేదు. ఇప్పుడు రూరల్ తహసీల్దార్‌గా కొత్త వారిని నియమించాల్సి ఉంది.

కన్యకా పరమేశ్వరి ఆలయానికి నూతన కార్యవర్గం

అల్లిపురం: పాతనగరంలోని కన్యకా పరమేశ్వరి ఆలయానికి 2024–26కు గానూ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆలయ కార్యదర్శి పెనుగొండ కామరాజు తెలిపారు. ఆలయ సమావేశ మందిరంలో ఆదివారం జరిగిన వార్షిక సర్వసభ్య సమావేశంలో అధ్యక్షుడిగా ఆరిశెట్టి దినకర్, కార్యదర్శిగా పెనుగొండ కామరాజు, కోశాధికారిగా దోమ వెంకట బాలాజీకుమార్ ఎన్నికయ్యారు. దోమ వెంకట సతీష్‌కుమార్, దుర్గా సోమేశ్వరరావు, గ్రంధి రామకృష్ణారావు, కందుల మధుబాబు ఉపాధ్యక్షులుగా, ఏడుగురిని సహాయ కార్యదర్శులుగా ఎన్నుకున్నారు. మహిళా విభాగం ఉపాధ్యక్షురాలిగా కమలశ్రీ, సంయుక్త కార్యదర్శిగా కట్టమూరి ప్రసన్నలతోపాటు 28 మంది కమిటీ సభ్యులు ఎన్నికయ్యారు. నూతన కమిటీతో విశాఖపట్నం క్లాత్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఫ్యాప్సీ అధ్యక్షుడు కంకటాల మల్లిక్ ప్రమాణ స్వీకారం చేయించారు. కన్యకాపరమేశ్వరి ఆలయ అభివృద్ధికి నూతన కమిటీ కృషి చేయాలని ఆకాంక్షించారు. ఆలయ సంఘ సభ్యులు, ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

పార్కులపై కన్నేసిన కూటమి?

- లెండివనం, చావిడి పార్కులు, 300 చ.గ. ఖాళీ స్థలం కబ్జాకు యత్నాలు
- గతంలో అడ్డుకున్న వైఎస్సార్ సీపీ కార్పొరేటర్
- కొత్త ప్రభుత్వంలో పావులు కదుపుతున్న టీడీపీ నేత



లెండివనం పార్కు



చావడి పార్కు

ఆరిలోవ: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రం రావణకాండగా మారింది. వైఎస్సార్ సీపీ నేతలనే లక్ష్యంగా చేసుకుని టీడీపీ నాయకులు దాడులకు పాల్పడుతున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన మంచిని చూసి తట్టుకోలేని నాయకులు.. వాటి ఆనవాళ్లు లేకుండా విధ్వంసకాండకు పాల్పడుతున్నారు. మట్టిని, ఇసుకను యథేచ్ఛగా దోచుకుంటున్న కూటమి నాయకులు.. ప్రజా అవసరాలు, వినోదం కోసం కేటాయించిన స్థలాలపై కూడా కన్నేశారు. ఎక్కడ ఖాళీ స్థలాలున్నాయో.. వెతికి కబ్జా చేసేందుకు సిద్ధమవుతున్నారు. తూర్పు నియోజకవర్గంలో పలు చోట్ల ఇదే పరిస్థితి కనిపిస్తోంది.

జీవీఎంసీ 20వ వార్డులోని ఈస్ట్ పాయింట్ కాలనీ కేడీపీఎం ఉన్నత పాఠశాల రోడ్డులో లెండివనం, చావడి పేర్లతో రెండు పార్కులు పక్కపక్కనే ఉన్నాయి. స్థానికులు ఈ పార్కుల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో సేదదీరుతున్నారు. పిల్లలు ఇక్కడ ఆటలాడుకుంటూ సరదాగా గడుపుతున్నారు. ఈ పార్కు, వీటికి చెందిన ఖాళీగా ఉన్న సుమారు 300 చదరపు గజాల స్థలాన్ని ఆక్రమించుకోవడానికి టీడీపీ స్థానిక నేత మళ్లీ సిద్ధమవుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు అదే పార్టీకి చెందిన ఓ మాజీ కార్పొరేటర్ తన ఇంటిని ఆనుకుని ఈ పార్కులకు చెందిన ఖాళీగా ఉన్న సుమారు 300 చదరపు గజాల స్థలాన్ని కబ్జా చేశాడు. అప్పట్లో స్థానికులు అడ్డుకున్నప్పటికీ అతను తన పని తాను చేసుకుపోయాడు. 2019లో వైఎస్సార్ సీపీ అధికారంలోకి రావడం, జీవీఎంసీ ఎన్నికల్లో ఈ వార్డు కార్పొరేటర్‌గా వైఎస్సార్ సీపీ నుంచి ముప్పల లక్ష్మి ఎన్నికయ్యారు. దీంతో ఇక్కడ కబ్జాకు అడ్డుకట్టపడింది. కార్పొరేటర్, స్థానికులు కబ్జాకు గురైన రెండు పార్కుల స్థలాలను స్వాధీనం చేసుకుని జీవీఎంసీకి అప్పగించారు. అప్పటి నుంచి జీవీఎంసీ ఆధీనంలో ఉన్న ఈ పార్కులను స్థానికులు వినియోగించుకుంటున్నారు. ఇటీవల రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ రావడంతో టీడీపీ నాయకుడు మళ్లీ ఇక్కడి ఖాళీ స్థలంతో పాటు పార్కులపైనా కన్నేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు. వాటిని ఎలాగైనా కొట్టేయాలని విశ్వప్రయత్నాలు చేస్తున్నారని మండిపడుతున్నారు. జీవీఎంసీ అధికారులు పకడ్బందీ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ఆక్రమించేందుకు యత్నిస్తున్నారు



కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆ పార్టీ నేతలు లెండివనం, చావడి పార్కులు ఆక్రమించడానికి విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. ఈస్ట్ పాయింట్ కాలనీలోని ఈ పార్కులకు చెందిన సుమారు 300 చదరపు గజాల ఖాళీ స్థలాన్ని మాజీ రాజ్యసభ సభ్యుడు గరికిపాటి మోహనరావు అల్లుడైన టీడీపీ మాజీ కార్పొరేటర్ నల్లూరి భాస్కరరావు గత టీడీపీ ప్రభుత్వంలో ఆక్రమించి తన ఇంటి స్థలానికి కలిపేశారు. 2021 తర్వాత కార్పొరేటర్‌గా నేను ఆ స్థలాన్ని పరిశీలించి జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులతో సర్వే చేయించాను. ఆ స్థలం జీవీఎంసీ పార్కులకు సంబంధించిన స్థలంగా గుర్తించిన అధికారులు.. ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఇప్పుడు మళ్లీ ఆ ఖాళీ స్థలంతో పాటు రెండు పార్కులను కూడా కబ్జా చేయడానికి వారు ప్రయత్నిస్తున్నారు. ఇందులో భాగంగా ఈ రెండు పార్కులను ప్రసాద్ అనే టీడీపీ నాయకుడి ఆధ్వర్యంలో కొద్ది రోజులుగా నిర్వహిస్తున్నారు. జీవీఎంసీకి చెందిన ఆయా పార్కుల తాళాలు ఆయన వద్దే ఉంచుకుని నచ్చిన సమయంలో వాటిని తెరుస్తున్నారు. ఈ స్థలాలు కబ్జా కాకుండా జీవీఎంసీ అధికారులు తగిన చర్యలు చేపట్టాలి.

– ముప్పల లక్ష్మీ సురేష్, కార్పొరేటర్, 20వ వార్డు

అరంగేట్రంలోనే అదుర్స్

- అద్భుతంగా సాగిన మహిత భరతనాట్య ప్రదర్శన

బీచ్‌రోడ్డు: విదేశాల్లో నివసిస్తున్నా.. ఆమె భారతీయ మూలాలు మరిచిపోలేదు. భారతీయ కళలపై ఆసక్తితో భరతనాట్యం నేర్చుకుంది. వీఎంఆర్డీఏ చిల్డ్రన్స్ ఎరీనాలో ఆదివారం భరతనాట్యంలో అరంగేట్రం చేసి అదుర్స్ అనిపించింది. ప్రవాసాంధ్రులైన కె.చంద్రశేఖర్ రాజు, శశికళ దంపతుల కుమార్తె కొప్పెల్ల మహిత అమెరికాలో విదుషీ రష్మి సుదీంద్ర వద్ద భరతనాట్యం నేర్చుకుంది. గురువు పర్యవేక్షణలో ఇక్కడ 9 అంశాలను చక్కగా ప్రదర్శించి ఆహూతులను నుంచి మన్ననలు పొందింది. ముందుగా ఈ కార్యక్రమాన్ని కనకమహాలక్ష్మి దేవస్థానం మాజీ చైర్మన్ వంకాయల సన్యాసిరాజు(తాతాజీ), మంతెన నరసింహారాజు, తునికి చెందిన ప్రముఖ న్యాయవాది ఎం.సూర్య నారాయణరాజు, కె.సత్యనారాయణ రాజు, ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్, ఎంవీవీ సత్యనారాయణ శైలజ దంపతులు ప్రారంభించారు. మహిత అద్భుతంగా నృత్యం చేయగా.. గానంతో కె.గురుప్రసాద్, వయోలిన్‌పై టి.యశస్వి, వేణువుపై కె.ఎస్.సమృద్ధ్, మృదంగంపై విక్రమ్ భరద్వాజ్ వాద్య సహకారం అందించారు. ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్, వాగ్దేవి వైస్ ప్రిన్సిపాల్ ఎంఎస్ఎల్ శైలజ వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు.


భరత నాట్యం చేస్తున్న మహిత

ఘనంగా ఢిల్లీ విజయోత్సవం


భగవత్ రామానుజాచార్యులకి బేడా మండపంలో తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: ఆషాఢ పౌర్ణమి సందర్భంగా వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ఆదివారం ఢిల్లీ విజయం ఉత్సవం ఘనంగా జరిగింది. విశిష్టాద్వైత స్థాపకులు భగవత్ రామానుజాచార్యులు తన పాండిత్యంతో ఢిల్లీ బాద్‌షాని మెప్పించిన రోజు ఆషాఢ పౌర్ణమి రోజు కావడంతో.. ఏటా ఆ రోజు శ్రీవైష్ణవ ఆలయాల్లో ఢిల్లీ విజయం ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో భగవత్ రామానుజాచార్యులు ఉత్సమూర్తిని విశేషంగా అలంకరించారు. సాయంత్రం 5 గంటలకు ఆలయ బేడా మండపంలోని హంస మూలన అధిష్టింపజేశారు. ఆయన వైభవాన్ని కీర్తిస్తూ వైభవ పారాయణ విన్నపం చేశారు. అనంతరం పల్లకీలో బేడా తిరువీధి ఘనంగా నిర్వహించారు. ఆలయ స్థానాచార్యులు టి.పి. రాజగోపాల్, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు సాతులూరి నరసింహాచార్యులు, పవన్ కుమారాచార్యులు, పారాయణదారులు ఈ ఉత్సవం జరిపించారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

శాస్త్రోక్తంగా తుది విడత చందన సమర్పణ

ఆషాఢ పౌర్ణమిని పురస్కరించుకుని స్వామికి ఆదివారం తుది విడత చందన సమర్పణను శాస్త్రోక్తంగా చేపట్టారు. తెల్లవారుజామున ఒంటి గంటకు స్వామిని మేల్కొలిపి సుప్రభాత సేవ నిర్వహించారు. అనంతరం ఆలయ బాండాగారంలో భద్రపరిచిన మూడు మణుగుల పచ్చి చందనాన్ని తీసుకొచ్చి స్వామికి సమర్పించారు. తర్వాత ఆరాధన, బాలభోగం, రాజభోగం నిర్వహించారు. దీంతో నాలుగు విడతల చందన సమర్పణ పూర్తయింది.

హాస్టల్‌లో చదవడం ఇష్టం లేక..

- పోలీసులు, స్కూల్ యాజమాన్యాన్ని పరుగులు పెట్టించిన బాలిక
- ఇంటికి చేరిన విద్యార్థిని

భీమునిపట్నం: హాస్టల్‌లో ఉండి చదువుకోవడం ఇష్టం లేని ఓ విద్యార్థిని.. అటు పాఠశాల యాజమాన్యాన్ని.. ఇటు పోలీసులను పరుగులు పెట్టించింది. హాస్టల్‌లో చెప్పాపెట్టకుండా వెళ్లిన ఆమె.. చివరికి తన ఇంటికే వెళ్లడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. వివరాలివీ.. అగనంపూడి వద్ద ఫార్మాసిటీ కాలనీకి చెందిన 15 ఏళ్ల బాలిక భీమిలిలోని దొరతోట వద్ద ఉన్న నవజీవన్ పబ్లిక్ స్కూల్‌లో చదువుకుంటూ.. అదే స్కూల్ హాస్టల్‌లో ఉంటోంది. ఆమె తండ్రి చనిపోయారు. నాలుగు రోజుల కిందట ఆ బాలిక ఇంటికి వచ్చి.. ఇంత దూరంలో ఉండి చదువుకోవడం ఇష్టం లేదని తల్లి సరోజినితో చెప్పింది. అయితే ఆమె కుమార్తెను మందలించి శనివారం సాయంత్రం హాస్టల్‌కు తీసుకు వచ్చి అప్పగించింది. కాగా.. ఆదివారం ఉదయం బాలిక హాస్టల్ నుంచి అదృశ్యమైంది. ఈ విషయాన్ని పాఠశాల యాజమాన్య ప్రతినిధులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు పాఠశాలకు చేరుకుని ఆమె పుస్తకాలను పరిశీలించగా.. అందులో అనిల్ అనే పేరుతో ఓ సెల్ ఫోన్ నంబర్ దొరికింది. ఆ నంబర్‌కు ఫోన్ చేయగా.. అనిల్ తాను బాలికకు అన్నయ్య వరస అవుతానని చెప్పాడు. దీంతో పోలీసులు బాలిక అదృశ్యమైన విషయాన్ని అతనితో చెప్పారు. ఈ విషయాన్ని బాలిక తల్లికి చెప్పేందుకు వెళ్తున్న సమయంలో.. ఆ ఇంటి దగ్గర్లోనే తిరుగుతున్న బాలికను గుర్తించాడు. ఆమెను ఇంటికి తీసుకెళ్లి జరిగిన విషయాన్ని తల్లికి చెప్పాడు. ఆమె బాలికను తీసుకుని భీమిలి స్టేషన్‌కు వచ్చారు. అయితే బాలిక తాను మళ్లీ హాస్టల్‌కు వెళ్లనని తేల్చి చెప్పడంతో.. పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. విద్యార్థిని బలవంతం చేయకుండా ఇంటికి తీసుకెళ్లాలని తల్లికి సూచించారు.

'నిజమైన కబడ్డీ సంఘం మాదే'

విశాఖ స్పోర్ట్స్: ఏపీ కబడ్డీ సంఘంగా తమకే గుర్తింపు ఉందని జిల్లా కబడ్డీ సంఘం ప్రతినిధులు ఆదివారం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు వివరించారు. ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఆయన్ని కలిశారు. 115/2010 ఏపీ కబడ్డీ సంఘంగా తమకు గుర్తింపు ఉందన్నారు. 2019లో అసోసియేషన్ ఎన్నికలు జరగ్గా.. 13 రోజుల వ్యవధిలోనే మరో వర్గం వ్యవస్థలను మేనేజ్ చేసి కోర్టులను తప్పుదోవ పట్టించిందన్నారు. వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుని క్రీడాకారులకు తగిన న్యాయం చేయాలని వినతిపత్రం అందజేశారు. ఏపీ కబడ్డీ సంఘం నిర్వాహక కార్యదర్శి శ్రీనివాసరావు, సభ్యులు ప్రస్తుత పరిణామాలను ఆయనకు వివరించారు.

ఖాతాదారులకు మొక్కల పంపిణీ


కేక్ కట్ చేస్తున్న బ్యాంక్ సిబ్బంది

తగరపువలస: బ్యాంకు ఆఫ్ బరోడా 117వ వ్యవస్థాపక దినోత్సవం ఆదివారం ఆనందపురం మండలం వేములవలస బ్రాంచ్‌లో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజర్ సిరిపురపు రామానాయుడు మాట్లాడుతూ వినియోగదారులకు నాణ్యమైన సేవలందించడంతో తమ బ్యాంకు దేశంలోనే రెండవ స్థానంలో ఉందన్నారు. తక్కువ వడ్డీకే వ్యవసాయ, బంగారం, ముద్ర, హౌసింగ్ రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వంద మంది వినియోగదారులకు మొక్కలు పంపిణీ చేశారు. వ్యాపారవేత్తలు చెన్నా వెంకటేష్, నాయుడు, కోన శ్రీను, మణికంఠ, బ్యాంకు సిబ్బంది కామేశ్వరరావు, బ్రహ్మాజీ, ధనుంజయ, పరిమళ, సమంత, కుమారి, ఎల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ తీగలపై కూలిన భారీ చెట్టు


విద్యుత్ స్తంభాలు మారుస్తున్న ఏపీఈపీడీసీఎల్ సిబ్బంది

మధురవాడ: బొట్టవానిపాలెం–స్వతంత్రనగర్ రోడ్డులో ఆదివారం వేకువజామున ఓ భారీ చెట్టు విద్యుత్ తీగలపై కూలిపోయింది. ఈ ఘటనలో మూడు కరెంటు స్తంభాలు పూర్తిగా, ఒక స్తంభం పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఓ విద్యుత్ స్తంభం ఇంటిపైకి వాలిపోయింది. దీంతో ఆ ప్రాంతంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయి అంధకారం నెలకొంది. ఉదయం ఏఈఈ రామమూర్తి ఆధ్వర్యంలో విద్యుత్ పునరుద్ధరణ పనులు చేపట్టి.. సాయంత్రానికి సరఫరా అందించారు. ఈ ప్రమాదంలో రూ.1.80 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు ఏఈఈ వెల్లడించారు.

బాయ్ సమావేశానికి ఏపీ కార్యవర్గ సభ్యులు

ఉక్కునగరం: బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(బాయ్) జాతీయ కార్యవర్గ సమావేశానికి ఆంధ్రప్రదేశ్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు హాజరయ్యారు. గౌహతిలో జరిగిన ఈ సమావేశానికి ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి, బ్యాడ్మింటన్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు హిమంత బిస్వా శర్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశంలో బ్యాడ్మింటన్ అసోసియేషన్ చేపడుతున్న కార్యక్రమాల గురించి చర్చించినట్లు జిల్లా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పల్లా శ్రీనివాసరావు తెలిపారు. గత ఏడాది వార్షిక బడ్జెట్‌ను ఆమోదించినట్లు చెప్పారు. ఈ సమావేశంలో ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారులు పుల్లెల గోపిచంద్, రాష్ట్ర అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అంకమ చౌదరి తదితరులు హాజరైనట్లు తెలిపారు.

ఇసుకకొండకు పోటెత్తిన భక్తులు


రమా సహిత సత్యనారాయణస్వామి

దాబాగార్డెన్స్: ఇసుకకొండ(బాబాజీకొండ)పై వెలసిన రమా సహిత సత్యనారాయణస్వామి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఆషాఢ పౌర్ణమి సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. వేకువజాము 2 గంటల నుంచే క్యూలు బారులుదీరాయి. ఉచిత, రూ.20, రూ.200 దర్శనాలు ఏర్పాటు చేశారు. పలువురు ప్రముఖులు స్వామిని దర్శించుకున్నారు. అనివెట్టి మండపం వద్ద భక్తులు దీపాలు వెలిగించారు. ఆలయ ఈవో టి.రాజగోపాల్‌రెడ్డి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

లారీల ఢీ..

- క్యాబిన్‌లో చిక్కుకున్న డ్రైవర్
- రెండు గంటల పాటు శ్రమించి బయటకు తీసిన పోలీసులు, తోటి డ్రైవర్లు
- 3 గంటల పాటు నిలిచిన ట్రాఫిక్


తీవ్ర గాయాలపాలైన డ్రైవర్‌ను బయటకు తీస్తున్న తోటి డ్రైవర్లు, పోలీసులు


బొగ్గు లోడుతో ఉన్న లారీని ఢీ కొట్టిన మరో లారీ.. నుజ్జయిన డ్రైవర్ క్యాబిన్

అక్కిరెడ్డిపాలెం: ఓ లారీని వెనుకనే వస్తున్న మరో లారీ ఢీకొన్న ఘటనలో డ్రైవర్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. సుమారు రెండు గంటల పాటు శ్రమించి ఆయన్ని క్యాబిన్ నుంచి సురక్షితంగా బయటకు తీశారు. ఈ ప్రమాదం వల్ల హైవేపై 3 గంటల పాటు ట్రాఫిక్ నిలిచిపోయింది.

జీవీఎంసీ 69వ వార్డు నాతయ్యపాలెం వద్ద ఆదివారం సాయంత్రం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. షీలానగర్ నుంచి పాతగాజువాక వైపు బొగ్గు లోడుతో వెళ్తున్న లారీని వెనుకనే వస్తున్న మరో లారీ బలంగా ఢీ కొట్టింది. బొగ్గు లారీ ముందు వెళ్తున్న కారువేగం తగ్గించగా.. బొగ్గు లారీ డ్రైవర్ స్లో చేశాడు. దీంతో వెనుకనే వస్తున్న లారీ బొగ్గు లారీని ఢీకొంది. ఈ ఘటనలో వెనుక లారీ క్యాబిన్ పూర్తిగా దెబ్బతినగా డ్రైవర్ అందులో ఇరుక్కుపోయాడు. అతని రెండు కాళ్లు అందులో చిక్కుకుపోవడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. సమాచారం అందుకున్న 108, పెదగంట్యాడ ఫైర్ సిబ్బంది, గాజువాక ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. సుమారు రెండు గంటల పాటు శ్రమించి డ్రైవర్‌ను క్యాబిన్ నుంచి బయటకు తీసి.. చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు. గాయాలపాలైన డ్రైవర్ తారా తేజేశ్వరరావుది శ్రీకాకుళం జిల్లా పలాస. విజయనగరం నుంచి స్టీల్‌ప్లాంట్‌కు వెళ్తున్నాడు. ఆ సమయంలో నగరానికి వెళ్తున్న టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు.. ప్రమాద స్థలం వద్ద ఆగారు. పరిస్థితిని పరిశీలించి పోలీసులకు పలు సూచనలిచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న గాజువాక సీఐ శ్రీనివాసరావు పరిస్థితిని సమీక్షించారు. ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. లారీలను క్రేన్‌ల సహాయంతో స్టేషన్‌కు తరలించారు. ఈ ప్రమాదంలో సుమారు 3 గంటలు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. ఆ సమయంలో ఎయిర్ పోర్టు దాటి ట్రాఫిక్ నిలిచిపోయింది. బస్సులు, లారీలు, కార్లు, ఆటోలు, ఇతర వాహనాలు సర్వీసు రోడ్లపై ప్రయాణించడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

ఎస్టీ కమిషన్ సభ్యుడితో మర్యాదపూర్వక భేటీ


జాటోతు హుస్సేన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న భెల్ ఎస్సీ, ఎస్టీ సంఘం నాయకులు

అక్కిరెడ్డిపాలెం: జాతీయ ఎస్టీ కమిషన్ మెంబర్ జాటోతు హుస్సేన్‌ను భెల్(హెచ్‌పీవీపీ) ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ఆదివారం నగరంలోని అతిథి గృహంలో కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి.. సంస్థలో ఎస్సీ, ఎస్టీల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి.. తగిన చర్యలు చేపట్టాలని అందులో విజ్ఞప్తి చేశారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కొల్లి దేముడు, కె.పవన్ కుమార్, పి.శ్రీను, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

రుషికొండ తీరం వెలవెల


వెలవెలబోతున్న రుషికొండ తీరం

కొమ్మాది: నిత్యం పర్యాటకులతో కళకళలాడే బీచ్‌లు వర్షాలకు బోసిపోయి కనిపిస్తున్నాయి. సముద్రం పెద్ద ఎత్తున కెరటాలతో ముందుకు చొచ్చుకుని వస్తోంది. తీరం కోతకు గురై అధ్వానంగా మారుతోంది. భీమిలి బీచ్, రుషికొండ బీచ్, మంగమారిపేటబీచ్, సాగర్‌నగర్ బీచ్‌లు ఆదివారం సాయంత్రం పర్యాటకులు లేక వెలవెలబోయాయి. ఇక్కడ చిరు వ్యాపారులు వ్యాపారాలు లేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

ముగిసిన సత్యభామ యువ నృత్యోత్సవాలు


సంప్రదాయ నృత్యంతో అలరించిన యువ నాట్య కళాకారులు

మద్దిలపాలెం: సత్యభామ యువ నృత్యోత్సవాలు ఆదివారంతో వైభవంగా ముగిశాయి. మద్దిలపాలెంలోని కళాభారతి ఆడిటోరియంలో నటరాజ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు ఈ నృత్యోత్సవాలు కనుల పండువగా జరిగాయి. చివరి రోజు కార్యక్రమాన్ని ప్రముఖ కూచిపూడి నాట్య కళాకారిణి సుదగాని గీతానారాయణ్ ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఏటా క్రమం తప్పకుండా యువ నృత్యోత్సవాలు ఎంతో అట్టహాసంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. దేశ నలుమూలల నుంచి నాట్య కళాకారులను విశాఖకు రప్పించేందుకు అకాడమీ వ్యవస్థాపక కార్యదర్శి బత్తిన విక్రమ్ కుమార్ గౌడ్ చేసిన కృషి ప్రశంసనీయమన్నారు. విక్రమ్ గౌడ్ మాట్లాడుతూ చివరి రోజు కార్యక్రమంలో 8 రాష్ట్రాల నుంచి నాట్య కళాకారులు పాల్గొన్నారని తెలిపారు. మొత్తం 13 రాష్ట్రాల నుంచి 65 మంది కళాకారులు పాల్గొన్నారని వివరించారు. నాట్య ప్రదర్శనలో పాల్గొన్న వారికి సత్యభామ యువ పురస్కారాలు ప్రదానం చేశారు. నృత్యోత్సవాల్లో అత్యధిక బహుమతులతో చత్తీస్‌గఢ్ మొదటి స్థానంలో, తమిళనాడు, రాయ్‌పూర్ బృందాలు తర్వాత స్థానాల్లో నిలిచాయన్నారు.

రోగుల కంటే మూటలే మిన్న..!

- పెద్దాస్పత్రిలో సిబ్బంది తీరుపై విమర్శలు





కేజీహెచ్‌లో రోగుల కంటే మూటలకే ప్రాధాన్యమా అని చూసిన వారు ముక్కున వేలేసుకుంటున్నారు. రోగుల కోసం ఉపయోగించాల్సిన వీల్‌చైర్లు, స్ట్రెచర్లను ఆస్పత్రి సామగ్రి తరలింపునకు వినియోగించడం చూసి విస్తుపోతున్నారు. ఒకవైపు ఆరోగ్యం బాగా లేని, అడుగు తీసి అడుగు వేయలేని రోగులు వార్డుల నుంచి పరీక్ష కేంద్రాలకు అతి కష్టంపై నడుచుకుంటూ వెళ్తుంటే.. వారిని తీసుకెళ్లాల్సిన వీల్‌చైర్లు, స్ట్రెచర్లపై బెడ్‌షీట్ మూటలు, ఇతర సామాగ్రిని తరలించడంపై రోగుల బంధువులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదేమి తీరని ప్రశ్నిస్తున్నారు.

– సాక్షి, విశాఖపట్నం